క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు కనులపండువగా జరిపించారు. ముందుగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకువెళ్లి, అభిషేకించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు



రేఖవానిపాలెం పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న వైద్య శిబిరం

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం భీమిలి మండలం రేఖవానిపాలెంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మందికి జనరల్, దంత, కంటి, ఎముకల వైద్య నిపుణులు చికిత్స అందించారు. ప్రిన్సిపాల్ ఎంబీవీ రాజు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం ద్వారా విద్యార్థులకు సామాజిక సేవపై అవగాహన కలిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉమాశంకర్, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త రుషి, సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శి గాయత్రి పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం



శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ అందిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత కంప్యూటర్ శిక్షణను ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి చదివిన పేద విద్యార్థినుల కోసం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ శిక్షణలో 40 మంది విద్యార్థినులు పాల్గొంటున్నారని, వారికి ఎమ్మెస్ ఆఫీస్, వర్డ్, పవర్ పాయింట్, ఇంటర్నెట్ కాన్సెప్ట్ మొదలైన వాటిల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. ఆసక్తి గలవారు 96432 22666 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా మరిడమ్మ విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు చిట్టివలస చిల్లవారి కళ్లాలలో శుక్రవారం మరిడమ్మ విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉదయం 6.30 గంటల నుంచి పండితుల కలశ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11.15 గంటల నుంచి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. స్థానిక పెద్దలు చిల్ల నరసింహులు, చిల్ల గురప్ప, సరగడ నరసింగరావు తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఇళ్ల మధ్యే 'స్క్రాప్'

- అనుమతుల్లేకుండా దుకాణాల నిర్వహణ
- ఎక్కడ చూసినా తుక్కు నిల్వలు
- స్థానికుల అవస్థలు



సాగర్‌నగర్‌లో ఇదీ పరిస్థితి ..



తాటిచెట్లపాలెం వద్ద ఉంచిన సామగ్రి

కొమ్మాది: నివాసాల మధ్య, ప్రధాన కూడళ్ల వద్ద, అంగన్‌వాడీ సెంటర్ సమీపాల్లో స్క్రాప్ దుకాణాల నిర్వహణతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ శివాలయం ఎదురుగా, తాటిచెట్లపాలెం ప్రధాన కూడళ్ల వద్ద, ఎండాడ రామాలయం వీధి, అంగన్‌వాడీ భవనం వద్ద, రుషికొండలో నివాసాల మధ్య ప్రాంతాల్లో విచ్చలవిడిగా తుక్కు (స్క్రాప్) నిల్వలు పెరిగిపోతున్నాయి. అనుమతులు లేకుండా ఈ దుకాణాలు నిర్వహించడంతో పాటు ప్రధాన ప్రాంతాల్లో ఈ దుకాణాలు ఏర్పాటు చేయడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

భరించలేని దుర్గంధం

తుప్పు పట్టిన బీరువాలు, పాత ఫ్రిజ్‌లు, పాడైపోయిన వాషింగ్ మెషీన్లు, ప్లాస్టిక్ సంచులు, అట్టలు, పేపర్లు, ఇనుప ఊచలు, విరిగిన కుర్చీలు, ఖాళీ బీరు బాటిళ్లు.. ఇలా ఎన్నో ఈ స్క్రాప్ దుకాణాల్లో నిల్వలు పేరుకుని పోతున్నాయి. వాటి నుండి దుర్వాసన భరించలేనంతగా ఉంటుంది. దీంతో పాటు ధూళి, వర్షపు నీరు తుప్పు నిల్వల్లో చేరుకోవడంతో దోమలు పెరిగిపోతున్నాయి. దోమల వల్ల రాత్రి సమయాల్లో కంటిపై కునుకు ఉండటం లేదని ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సామగ్రి వల్ల ఎలుకలు నివాసాల్లోకి వస్తున్నాయని తెలిపారు. ఇలాంటి వ్యాపారాలను నివాసాల మధ్య, ప్రధాన కూడళ్ల వద్ద నిర్వహించకుండా, ఊరికి దూరంగా నిర్వహించాలని కోరుతున్నారు. ఈ స్క్రాప్ దుకాణాల యజమానులు దొంగ వస్తువులు కూడా కొంటున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఇక్కడ ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని



ఎండాడ నివాసాల మధ్య ఉన్న స్క్రాప్ దుకాణం

ప్రశ్నిస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఈ వ్యాపారాలకు జీవీఎంసీ అధికారులు, పోలీసుల సహకారం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు స్పందించాలని, అనధికార స్క్రాప్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దోమలు, ఎలుకలతో ఇబ్బందులు

రాత్రయితే దోమలతో నిద్ర ఉండటం లేదు. ఎలుకలు ఇళ్లలో చేరుతున్నాయి. ఏ వస్తువులు పాడు చేస్తాయో అని భయపడుతూ ఉన్నాం. శానిటరీ అధికారులకు చెప్పినా, ఫలితం లేకుండా పోయింది. దుకాణాలను దూరంగా తరలించి, మా ఇబ్బందులు తొలగించాలి.

– ఎస్. లక్ష్మి, సాగర్‌నగర్

అధికారులు చర్యలు తీసుకోవాలి

నివాసాలు, మెయిన్ జంక్షన్లు, పాఠశాలల వద్ద స్క్రాప్ దుకాణాలు నిర్వహించడం సరి కాదు. ఊరికి దూరంగా నిర్వహించాలి. జనావాసాల మధ్య దుకాణాల వల్ల చాలా ఇబ్బంది పడుతున్నాం. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎస్. సుందర్రావు, తాటిచెట్లపాలెం

ఏకాగ్రతతోనే లక్ష్యసాధన



మాట్లాడుతున్న ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు

తగరపువలస: విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెంచుకుని, అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.కిషోర్‌బాబు అన్నారు. చెరకుపల్లి అవంతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. డిగ్రీ ప్రారంభం నుంచి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగడం ద్వారా మూడేళ్ల అనంతరం స్థిరపడవచ్చన్నారు. అవంతి విద్యాసంస్థల డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు తాము కోరుకున్న లక్ష్యాలను సాధించడానికి అవసరమైన వసతులు కల్పించడానికి యాజమాన్యం సిద్ధంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ పిన్నింటి రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులను నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే తమ అధ్యాపకుల లక్ష్యమన్నారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

పోలీస్ బెటాలియన్‌లో ఆయుధాల ప్రదర్శన



ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ

పీఎం పాలెం: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జీవీఎంసీ ఆరో వార్డులోని ఏపీఎస్‌పీ పోలీస్ బెటాలియన్ ప్రాంగణంలో శుక్రవారం పోలీసులు ఉపయోగించే ఆయుధాలను ప్రదర్శించారు. వీటిని వీక్షించడానికి వచ్చిన విద్యార్థులకు ఆయుధాల పనితీరును 16వ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ వివరించారు. అనంతరం పోలీస్ శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమిలి ఆర్డీవో కె.సంగీత్ మాథూర్ హాజరయ్యారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.సత్యం, ఈ ప్రాంతంలోని పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పశుగణన ప్రారంభం

భీమునిపట్నం: భీమిలి, పద్మనాభం మండలాల పరిధిలో శుక్రవారం నుంచి పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు జరుగుతుందన్నారు. ఈ రెండు మండలాల్లో మొత్తం 45 కుటుంబాలకు సంబంధించిన పశువులు ఉండగా, ఎవరి వద్ద ఎన్ని ఉన్నాయి అన్న పూర్తి వివరాలను సేకరిస్తామన్నారు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లోని పశువులకు ఆరోగ్యపరమైన సమస్యలు రాకుండా జాగ్రత్తలు తెలియజేసేందుకు, వ్యాక్సిన్లు అందించేందుకు, చికిత్స అందించేందుకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.

పశుగణన పోస్టర్ల ఆవిష్కరణ

పద్మనాభం: పద్మనాభం మండలంలో ఈ నెల 28వ తేదీ వరకు చేపట్టనున్న పశుగణన పోస్టర్లను రెండు గ్రామాల్లో శుక్రవారం ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. మద్దిలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, రెడ్డిపల్లిలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు ఆవిష్కరించారు. దీనిలో భాగంగా పశువులు, వ్యవసాయ పరికరాల వివరాలు సేకరిస్తారు. కార్యక్రమాల్లో పశు సంవర్ధక శాఖ ఏడీ బి.వెంకటరమణ, పశు వైద్యాధికారులు మహేష్ కుమార్, అరుల్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పశువుల వివరాలు నమోదు తప్పనిసరి

తగరపువలస: పాడిరైతులు తమ వద్ద ఉన్న గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్లు తదితరాల వివరాలను తప్పనిసరిగా పశుసంవర్ధకశాఖ సిబ్బంది లేదా రైతు భరోసా కేంద్రాలలోని యాప్‌ల ద్వారా అప్‌లోడ్ చేయించుకోవాలని భీమిలి మండలం దాకమర్రి పశువైద్యాధికారి జి.కాంతికిరణ్ కోరారు. శుక్రవారం 21వ అఖిల భారత పశుగణన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో పోస్టర్లను జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు ప్రారంభించారు. కాంతికిరణ్ మాట్లాడుతూ పశువుల వివరాలు అప్‌లోడ్ చేయడం వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పాడిరైతులకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ ఏడీ వెంకటరమణ, సర్పంచ్ గాడు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టం ద్వారా సత్వర న్యాయం



ప్రసంగిస్తున్న డా.నందిని

కొమ్మాది: గీతం న్యాయ విశ్వవిద్యాలయం, దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా 'డాక్టర్ల కర్తవ్యాలు, హక్కులు, నైతిక సవాళ్లు' అనే అంశంపై శుక్రవారం గీతంలో సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ డా. సి.పి నందిని మాట్లాడుతూ వినియోగదారుల సంరక్షణ చట్టంలో రోగులకు ఎదురయ్యే అన్యాయాలకు న్యాయం పొందడానికి ఉన్న అవకాశాలను వివరించారు. వైద్యుని బాధ్యతలు, వినియోగదారుల హక్కులు, వైద్య నిర్లక్ష్యం కారణంగా ఎదురయ్యే పరిణామాలను వివరిస్తూ పలు తీర్పులను వివరించారు. కార్యక్రమంలో డా. డి.సూర్యప్రకాశరావు, డా.ఆర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

హిందీ హయ్యర్ పరీక్ష ఫలితాలు విడుదల

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ–చెన్నై ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన పరీక్షలకు సంబంధించి హయ్యర్ పరీక్షా ఫలితాలు శుక్రవారం విడుదల అయ్యాయి. భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి ద్వారా రాష్ట్రభాష విశారద పూర్వార్థ, విశారద ఉత్తరార్థ, రాష్ట్రభాష ప్రవీణ పూర్వార్థ, ప్రవీణ ఉత్తరార్థ పరీక్షలకు 22 మంది విద్యార్థులు హాజరుకాగా 16 మంది ఉత్తీర్ణత సాధించినట్టు మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. 2025 ఫిబ్రవరిలో నిర్వహించనున్న లోయర్, హయ్యర్ పరీక్షలకు ఉచిత శిక్షణను ఇటీవల విజయదశమి రోజున ప్రారంభించినట్లు చెప్పారు. ఈ పరీక్షలకు ఫీజు నవంబరు 30లోగా చెల్లించాలన్నారు. వివరాలకు 89856 47419, 89858 97419 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గీతంలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

కొమ్మాది: ఇండో పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న రాజకీయ, ఆర్థిక సమీకరణాలు, భద్రత అంశాలపై గీతంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. తైవాన్‌కు చెందిన ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ అధికారిక ప్రతినిధి రాబర్ట్ హిష్ మాట్లాడుతూ తైవాన్ చిన్న దేశం అయినా విద్య, ఆరోగ్య, వాణిజ్య రంగాల్లో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. అయితే అంతర్జాతీయ వాణిజ్యంలో తైవాన్ పాత్రను తగ్గించడానికి చైనా ఉద్దేశపూర్వకంగా సమస్యలు సృష్టిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (న్యూఢిల్లీ) వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన



బోర్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనందకుమార్

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలోని ప్రభుత్వ భూములను తహసీల్దార్ కె.ఆనంద కుమార్ శుక్రవారం పరిశీలించారు. గతంలో ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఉన్న వారి వద్ద తప్పుడు పట్టాలు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వీఆర్వో రవి ఉన్నారు.

ఎట్టకేలకు రహదారిపై దిమ్మె తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



దిమ్మె తొలగించిన అనంతరం రహదారి ఇలా..

తగరపువలస: ఏళ్ల తరబడి స్థానికులకు ఇబ్బంది కలిగించేలా వినాయకుని పేరుతో రహదారిపై అడ్డంగా నిర్మించిన దిమ్మెను జీవీఎంసీ జోక్యంతో ఎట్టకేలకు తొలగించారు. జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు రజక వీధి వలందపేట కాలనీలో కొందరు ఏటా నిర్వహించే గణేష్ నవరాత్రి ఉత్సవాలకు గాను శాశ్వతంగా రెండున్నర అడుగుల గట్టు నిర్మించారు. మిగిలిన వారి రాకపోకలకు ఇబ్బంది కలిగించేలా ఉన్న ఈ దిమ్మెను తొలగించాలని స్థానికులు ఏకరువు పెట్టినా పట్టించుకోకుండా అలాగే ఉంచేశారు. దీంతో గత నెల 21న ×దర్జాగా కబ్జా₹ శీర్షికతో సాక్షిలో ప్రచురించిన వార్తకు భీమిలి టౌన్ ప్లానింగ్ సిబ్బంది స్పందించారు. నమ్మివానిపేట, సంగివలస కాలనీ, కోరాడపేటలో ఆక్రమణలు తొలగించి, హెచ్చరికల బోర్డులు పెట్టారు. అప్పటికి ఇంకా వలందపేటలో గణేష్ ఉత్సవాలు జరుగుతున్నందున దిమ్మె తొలగించడానికి కొంత సమయం గడువు ఇచ్చారు. ఉత్సవాలు ముగిసిన తరువాత ఎట్టకేలకు రెండు రోజులుగా స్థానికులే ఈ దిమ్మెను స్వయంగా తొలగించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంత నిర్లక్ష్యమా..!

- ప్రధాన రహదారి మధ్య పగిలిన పైప్‌లైన్
- నెలలు గడుస్తున్నా స్పందించని అధికారులు



గోతిలో ఇరుక్కున్న ట్రాక్టర్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జాతీయ రహదారి నుంచి రుషికొండకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో జీవీఎంసీ వాటర్ పైప్‌లైన్ పగిలి నెలలు గడుస్తున్నా, సంబంధిత అధికారులు మాత్రం చర్యలు తీసుకోలేదు. దీంతో రోడ్డు మధ్యలో గొయ్యి ఏర్పడి, ఓ వైపు నీరు పారుతూ, మరో వైపు రోజురోజుకు గొయ్యి పెద్దదవుతోంది. ఈ రహదారి మీదుగా రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ గొయ్యి కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం అటుగా వెళ్తున్న ఓ ట్రాక్టర్ గోతిలో దిగబడిపోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కట్టుదిట్టమైన చర్యలు

- ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్



కార్‌షెడ్ జంక్షన్‌లో ట్రాఫిక్ పరిశీలిస్తున్న ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్

మధురవాడ: ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని విశాఖ సిటీ ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం పీఎం పాలెం సిగ్నల్, డీమార్ట్ తదితర ప్రాంతాల్లో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఆయన వేర్వేరుగా ట్రాఫిక్ పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసు అధికారులకు సూచనలు చేశారు. ఉదయం సాయంకాల సమయాల్లో అదనపు సిబ్బందిని సిగ్నల్స్ వద్ద నియమించి, చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమాల్లో ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవ్, లా అండ్ ఆర్డర్ ఏసీపీ అప్పలరాజు, సీఐలు బాలకృష్ణ, సాయి, ఎస్‌ఐలు ప్రసాద్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంహెచ్‌వో

మధురవాడ: పారిశుధ్య పనుల నిర్వహణపై దృష్టి కేంద్రీకరించి సక్రమంగా చేయించేలా అంతా పనిచేయాలని జీవీఎంసీ జోన్–2 ఏఎంహెచ్‌వో కిషోర్ ఆదేశించారు. జీవీఎంసీ జోన్–2 కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడ ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. కింది స్థాయి సిబ్బంది కూడా బాధ్యతాయుతంగా పని చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జోన్ పరిధిలో 5 నుంచి 13 వరకు గల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్‌పై గతుకులు, తుప్పలు



విశాఖ వైపు ఫ్లై ఓవర్‌పై గతుకులు



ఫ్లై ఓవర్‌పై రహదారి పక్కన తుప్పలు

తగరపువలస: తగరపువలస నుంచి విశాఖ వైపు వెళ్లే మార్గంలో ఆనందపురం ఫ్లై ఓవర్ గతుకులు, తుప్పలతో నిండిపోయింది. ఆనందపురం ప్రారంభంలో పోలీస్ చెక్ పోస్టు నుంచి క్రాస్‌రోడ్డు వరకు పలుచోట్ల పెద్ద గుంతలు ఉండటంతో వాహనాలు అందులో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. అంతేకాకుండా ఫ్లై ఓవర్‌కు ఇరువైపులా తుప్పలు మొలిచి, అడవిని తలపిస్తున్నాయి. జాతీయరహదారుల సంస్థ ఇంజినీరింగ్ సిబ్బంది స్పందించి గతుకులను పూడ్చాలని, ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించి ప్రమాదాలను నివారించాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

రహదారి పక్కనే పశువుల కళేబరాలు

- దుర్గంధంతో ప్రయాణికుల అవస్థలు



భీమిలి రోడ్డులో చెరువును ఆనుకుని దూడ కళేబరం

తగరపువలస: తగరపువలస నుంచి భీమిలి వెళ్లే రహదారిలో చిల్లపేట చెరువు పక్కన చనిపోయిన కుక్కలు, పిల్లలు, పశువుల కళేబరాలను పడేస్తుండటంతో ఈ మార్గంలో పయనించేవారు ఇబ్బంది పడుతున్నారు. ముక్కుపుటాలు అదిరేలా దుర్గంధం వ్యాపిస్తుండటంతో ముక్కు మూసుకుని ప్రయాణిస్తున్నారు. జంతు కళేబరాలను గోనె సంచుల్లో కుక్కి, ఇక్కడికి తీసుకువచ్చి చెట్లు, తుప్పల మాటున పడేస్తున్నారు. రోజులు గడిచేకొద్దీ ఈ కళేబరాల నుంచి వచ్చే బ్యాక్టీరియా ఈ ప్రాంతమంతా విస్తరిస్తోంది. రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగిస్తే.. ఎవరైనా ఇలాంటి కళేబరాలు పడేసినప్పుడు జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది తొలగించడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా జీవీఎంసీ పారిశుధ్య విభాగం స్పందించి చనిపోయిన జంతువులను పూడ్చిపెట్టకుండా బహిరంగ ప్రదేశాలలో వేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

కళ తప్పుతున్న కళాకృతులు



తాబేలు బొమ్మపై ఆరవేసిన బట్టలు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్ కళ తప్పుతోంది. ఇప్పటికే బీచ్ వ్యర్థాలతో దర్శనమిస్తోంది. ఇక్కడ కుక్కలు నిత్యం సంచరించడంతో పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండా ఇక్కడ బీచ్ వద్ద చిల్డ్రన్స్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన కళాకృతులపై పర్యాటకులు తడిచిన బట్టలు ఆరవేస్తున్నారు. దీంతో ఇవి కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి, కళాకృతులు కళావిహీనంగా మారకుండా చూడాలని సందర్శకులు కోరుతున్నారు.